# మారుతున్న బిజినెస్ ట్రెండ్

- విస్తరిస్తున్న రోడ్డు పక్కన విక్రయాలు
- చిరు వ్యాపారుల నయా అడ్డా..
- కూరగాయలు మొదలు బట్టల దాకా అన్ని అక్కడే..



స్వెట్టర్లను, దస్తులను రోడ్డు పక్కన అమ్ముతున్న చిరువ్యాపారులు

భైంసా, డిసెంబర్ 14 : మనం ఏ నిత్యావసర వస్తువు కొనాలన్న అందుబాటులో ఉన్న మార్కెట్‌కు లేదా దుకాణాలకు వెళ్తుంటా. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ వస్తువు కావాలన్నా రోడ్డు పక్కన దొరుకుతుంది. ఈ ఉరుకులు, పరుగుల జీవితంలో ఓపిక, తీరిక లేని పరిస్థితుల్లో రోడ్డు మీద ప్రయాణం చేస్తూనే అవసరమైనవి కొంటున్నారు. దీనికి ఆసరాగా చేసుకున్న చిరు వ్యాపారులు రోడ్లపైనే తమ బిజినెస్ సెంటర్లుగా మార్చుకున్నారు. బయట కంటే తక్కువ ధరకే అందిస్తూ తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు. ఈ నయా బిజినెస్ ట్రిక్కుతో లాభాలు ఎక్కువ వస్తుండడంతో విక్రయాలు ఊపందు కున్నాయి. రోడ్డు పక్కన మరిన్ని దుకాణాలు వెలుస్తున్నాయి.

### ఏ టూ జడ్ అన్ని అక్కడే..

ఇది వరకు రైతులు కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మేవారు. కొందరు ఆటోలు, బస్సులు, ద్విచక్రవాహనాలపై తీసుకెళ్లి వ్యాపారులకు విక్రయించే వారు. మరికొందరు స్వయంగా మార్కెట్‌లో కూర్చొని అమ్ముకునే వారు. దీని వల్ల ఒక పూట పనిపోవడమే కాకుండా రాను పోను ఖర్చులు భరించాల్సి వచ్చేది. వినియోగదారులు మార్కెట్‌కు వెళ్లి కూరగాయ లను కొనుక్కునేది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. ఇప్పుడు రైతులు ఓ వైపు పొలాల్లో పనులు చేసుకుంటూ ఆ తర్వాత రోడ్డు పక్కనే కూరగాయలు అమ్ముకుంటున్నారు. ఇలా ఒక రైతులే కాకుండా చాలా మంది చిరు వ్యాపారులు రోడ్డు పక్క ప్రాంత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకు న్నారు. గతంలో ఒక వ్యాపారం చేయాలంటే పట్టణాల్లో ఒక రూమ్ కిరాయి తీసుకొని అడ్వాన్స్ చెల్లించడంతో పాటుగా నెల నెలా కిరాయిలు, కరెంటు బిల్లులు, మెయింటనెన్స్ ఇలా బోలెడంత ఖర్చయ్యేది. ఇప్పుడు అవేవి లేకుండా కూరగాయలు విక్రయించే వారే రోడ్డు పక్కన వ్యాపారాలు మొదలు పెట్టారు. సొంతంగా వాహనాలను సమకూర్చుకొని టిఫిన్ సెంటర్, మధ్యాహ్న భోజనం, బిర్యానీలు అన్ని రకాల దుస్తులు, కళ్లద్దాలు, ఉల్లి గడ్డలు, పండ్లు జ్యూస్‌లు, ఎలక్ట్రిక్ వస్తువులు, డ్రైఫ్రుట్స్, చెప్పులు, ఇలా చెప్పుకుంటే పోతే ఎన్ని రకాల వ్యాపారాలు ఉన్నాయో. ప్రస్తుతం అన్ని రకాల వస్తువులు, తిను బండారాలు మొత్తంగా రోడ్డు పక్కనే దొరుకుతున్నాయి. హోటల్‌కే వెళ్లి తినాలి. దుకాణాలకు వెళ్లి వస్తువులు కొనాలనే ఆలోచన నుంచి వినియోగదారుడు క్రమక్రమంగా బయటపడి రోడ్డు పక్కనే ప్రయాణం చేస్తూనే తమకు కావాల్సినవి కొనుగోలు చేసుకుంటున్నారు. తాజా కూరగాయాలు, ఇతర వస్తువులు తక్కువ ధరలకే వస్తుండడంతో వినియోగదారులు రోడ్డు పక్కన వ్యాపారుల వద్ద కొనేందుకు ఇష్ట పడుతున్నారు. రైతులు, చిరు వ్యాపారులు సైతం తమకు ప్రయాణ ఖర్చులు, అద్దె, కరెంటు చార్జీలు, మెయింటనెన్స్ చార్జీలు లేకపోవడంతో తక్కువ ధరకే అమ్ముతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.



పండ్లను అమ్ముతున్న చిరు వ్యాపారులు



సన్మానిస్తున్న కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి

## ఆలయ అధ్యక్షుడికి వేణుగోపాలా చారి సన్మానం

భైంసా, డిసెంబర్14 : కుభీర్ మండలంలో గల సాయిబాబా ఆలయ అధ్యక్షుడు నర్సప్పను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి భైంసాలోని విశ్రాంతి భవనంలో ఆయనను శాలువాతో సత్కరించారు. దేవేందర్, కొట్టె హన్మండ్లు, ప్రభాకర్, గన్ను నర్సారెడ్డి, చిన్నన్న, సోలంకి భీంరావు, హైమద్, నరేందర్, తదితరులు ఉన్నారు.

## పోలీసుల విధుల నిర్వహణ అభినందనీయం

- నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14 : అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన పోలీసు అధికారులకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి ఘటనలు జరుగకుండా ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది శ్రమించారని పేర్కొన్నారు. ఏఎస్పీ క్రాంతిలాల్ పాటిల్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, సీసీఆర్బీ రవీందర్ రెడ్డి, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, సీఐలు పురుషోత్తం చారి, మోహన్, వినోద్, నవీన్, ఆర్ఐలు రాంనిరంజన్, రమేశ్, రామకృష్ణ, యంటీవో వినోద్ తదితరులున్నారు.

### సెల్‌ఫోన్ల అందజేత

నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న, దొంగలించిన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ట్రేస్ చేసి బాధితులకు అందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో 25 సెల్‌ఫోన్లను అందించారు.



డీఎస్పీ గంగా రెడ్డికి ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

## అయ్యప్ప పడిపూజ

కుంటాల, డిసెంబర్ 14 : మండలంలోని పెంచికల్‌పాడ్‌లో గురువారం గురుస్వామి జక్కని గజేందర్ చేతుల మీదుగా గురజాల ప్రసాద్ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. అనంతరం ప్రసాద వితరణ చేశారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీలు

భైంసా, డిసెంబర్ 14 : భైంసాలోని జిన్నింగ్ మిల్లులతో పాటు పెట్రోల్ బంకుల్లో గురువారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికల కొలతల అధికారి భూలక్ష్మి మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో స్టాంపింగ్ గడువు ముగియడంతో వచ్చానని పేర్కొన్నారు. ఈమె వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారి

# కత్తెర పురుగు నివారణకు చర్యలు



కుంటాల : మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్ర వేత్తలు

కుంటాల, డిసెంబర్, 14: యాసంగిలో అధిక విస్తీర్ణంలో మక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. 40 రోజులకు పైగా రైతులు వ్యవసాయం పనుల్లో నిమగ్నమయ్యారు. ఆరంభంలో వేసిన పంట ప్రస్తుతం ఏపుగా పెరిగింది. పది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో కత్తెర పురుగు ఉధృతి పెరిగి పంట ఎదుగుదలకు ఆటంకంగా మారింది. దీనిపై రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వ్యవసాయ శాఖ స్పందించింది. మక్కజొన్న పరిశోధన కేంద్రం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్ర వేత్తలు గురువారం మండలంలో పర్యటించా రు. పలు మక్కజొన్న పంట క్షేత్రాలను పరిశీలించారు. కత్తెర పురుగు, మట్టి నమునాలను సేకరించారు. యూరియా కంటే పొటాష్ ఎక్కువ వాడాలని రైతులకు సూచించారు. కత్తెర పురుగు నివారణకు ఏ పురుగు మందులు వాడాలని తెలుసుకోవడానికి స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని వారు కోరారు. ఈ సందర్భంగా రైతులు మక్కజొన్న పంట రక్షణకు సూచనలు, సలహాలు అందించారు. ఏఈవోలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటి స్తూ రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని ఎంపీపీ గజ్జారాం కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ నగేశ్ కుమార్, బీ మల్లయ్య, కే వాణిశ్రీ, డీఏవో అంజిప్రసాద్, ఏడీఏ వీణ, ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో గణేశ్, రైతులు రమా కాంత్, సాయిరాం, గంగారెడ్డి, జనార్ధన్, గౌస్, తదితరులు ఉన్నారు.

## లైంగికదాడికి యత్నం : కేసు నమోదు

తానూర్, డిసెంబర్ 14 : వివాహితపై లైంగిక దాడికి యత్నించిన ఘటన నిర్మల్ జిల్లా తానూర్ పోలీస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లోకం సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన వివాహిత బుధవారం వ్యవసాయ పనుల కోసం చేను వద్దకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన కైలర్ పోతన్న (35) వివాహిత వద్దకు వెళ్లి చేయి పట్టుకొని లైంగికదాడికి యత్నించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం అతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ పేర్కొన్నారు.

## 22న మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్,డిసెంబర్14 :మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 22న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కావల రమేశ్ గురువారం పేర్కొన్నారు. 19న సాయంత్రం వరకు 3గంటల లోపు తమతమ ప్ర గతి నివేదికలు కార్యాలయంలో సమర్పించాలన్నారు.